నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 9 ఆగస్టు 2024 | HYDERABAD

## • వినతి



ఓయూలో నూతన వీసీ నియమితులైన తర్వాతే కొత్త టెండర్లు పిలవాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. పాత టెండర్ల కమిటీని రద్దు చేసి.. కొత్తది ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు గురువారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. -ఉస్మానియా యూనివర్సిటీ



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. విద్యార్థినుల నృత్య ప్రదర్శన అలరించింది.

## • నిబంధనల 'దారి' తప్పి..



మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు గురువారం బాచుపల్లిలోని కోకాకోలా యూటర్న్ వద్ద ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. మియాపూర్, గండిమైసమ్మ ప్రధాన రహదారిలో రాంగ్‌రూట్‌లో వస్తున్న 30 వాహనాలను పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. -దుండిగల్

## • దిశానిర్దేశం



షేక్‌పేట ఎస్సీ డెవలప్‌మెంట్ ఎక్సలెన్స్ హై స్కూల్, జూనియర్ కాలేజీలో గురువారం నిర్వహించిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హాజరయ్యారు. కష్టపడి చదివితే కల సాకారమవుతుందని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. వారితో కలిసి భోజనం చేశారు. -సిటీబ్యూరో

## • పర్యావరణ పరిరక్షణకు..



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఏడో డివిజన్‌లో గురువారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక మేయర్ లతా ప్రేమ్ గౌడ్, కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్, బీజేఎంసీ కమిషనర్‌లతో కలిసి మొక్కలు నాటారు -బండ్లగూడ, ఆగస్టు 8

## • నిరసన గళం



సిటీలో బస్సులను పెంచాలంటూ..గురువారం బస్‌భవన్ వద్ద బైఠాయించి.. నిరసన తెలుపుతున్న సీపీఎం నగర కమిటీ నేతలు

## అప్పులు తీర్చలేక.. రైలెక్కి..

మారేడ్‌పల్లి, ఆగస్టు 8: అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి.. రైలెక్కి.. హైటెన్షన్ వైర్లను పట్టుకొని.. ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స పొందుతూ చనిపోయాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారంకాలనీకి చెందిన గరిశెట్టి వెంకటదుర్గ రామకృష్ణ (50) ప్రైవేట్ ఉద్యోగి. మద్యానికి బానిసై అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈనెల 5న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. అదే రోజు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫారం నంబర్-9లో ఆగి ఉన్న రైలెక్కి.. హైటెన్షన్ వైర్లను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని రైల్వే పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించగా, బుధవారం చికిత్స పొందుతూ చనిపోయాడు. కేసు దర్యాప్తులో ఉంది.

## వర్షసూచన



సిటీబ్యూరో, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): ఆవర్తనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 30.3, కనిష్ఠం 22.2 డిగ్రీలు, గాలిలో తేమ 74 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## రాంగ్‌రూట్‌లో వెళ్లి.. మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 8: బైక్‌పై రాంగ్‌రూట్‌లో వెళ్లి.. ఎదురుగా వచ్చిన కారును ఢీకొట్టిన ఓ యువకుడు మృతి చెందాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కేపీహెచ్‌బీ కాలనీ పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లాకు చెందిన కుర్వ సాయితేజ(22) ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ.. కేపీహెచ్‌బీకాలనీ అడ్డగుట్టలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. గురువారం ఉదయం అతడు హాస్టల్‌లో ఉంటున్న హరిప్రసాద్‌తో కలిసి బైక్‌పై మెయిన్ రోడ్డుపై బయలుదేరాడు. జాతీయ రహదారి పక్కన ఉన్న మెహఫిల్ హోటల్ వైపు రాంగ్‌రూట్‌లో బైక్‌పై వెళ్తూ.. ఎదురుగా వచ్చిన కారును ఢీకొట్టాడు. ద్విచక్రవాహనం నడుపుతున్న సాయితేజకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. బైక్‌పై వెనుక కూర్చున్న హరిప్రసాద్ చేతులు విరిగిపోయాయి. అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సాయితేజ హెల్మెట్ ధరించలేదని, రాంగ్‌రూట్‌లో వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. సాయితేజ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అమీర్‌పేటలో చెట్ల కొమ్మలు విరిగిపడటంతో తెగిపోయిన విద్యుత్ తీగలు(ఫైల్)

# డిస్కం.. నిర్లక్ష్యం

### మొక్కుబడిగా విద్యుత్ నెట్‌వర్క్
### క్షేత్ర స్థాయి సర్వేలో బయటపడిన లోపాలు
### ప్రమాదకరంగా 12,598 స్తంభాలు
### కంచెలు లేకుండా 1,320 ట్రాన్స్‌ఫార్మర్లు
### అధ్వాన నెట్‌వర్క్‌తోనే తరచూ అంతరాయాలు
### లోపాలు సరిదిద్దేందుకే రూ. 25 కోట్లు

*ప్రమాదకరంగా స్తంభాలు..కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లు.. కాలం చెల్లిన పరికరాలు... క్షేత్రస్థాయిలో విద్యుత్ నెట్‌వర్క్ తీరిది. ఈ కారణంగానే తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. డిస్కం నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. సర్వేలో బయటపడిన ఈ లోపాలను సరిదిద్దేందుకే రూ. 25 కోట్ల వ్యయం అవుతుండటం కొసమెరుపు.*

-సిటీబ్యూరో, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ)

అత్యంత కీలకమైంది క్షేత్ర స్థాయిలోని విద్యుత్ నెట్‌వర్క్. అలాంటి నెట్‌వర్క్‌లో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ యంత్రాంగానిదే. డిమాండుకు సరిపడా కరెంటు ఉన్నా... అంతరాయాలు మాత్రం నిత్యకృత్యంగా మారాయి. అయితే క్షేత్ర స్థాయిలోని నెట్ వర్క్ ప్రధానమని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నా.. అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఒక సబ్ స్టేషన్ నుంచి 11 కేవీ ఫీడర్ల ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు, అక్కడి నుంచి ఎల్ టీ లైన్ల ద్వారా ఇంటింటికీ సరఫరా జరిగే నెట్‌వర్క్‌లోనే చాలా లోపాలు ఉన్నాయని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చేపట్టిన 11 కేవీ ఫీడర్ సర్వేలోనే తేలింది. సుమారు రెండు నెలల పాటు జరిగిన సర్వేలో టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో ప్రమాదకరంగా 12,598 స్తంభాలు ఉన్నాయని, అదేవిధంగా 1320 ట్రాన్స్‌ఫార్మర్లు కంచెలు లేకుండా ఉన్నట్లు గుర్తించారు. ఇవే కాకుండా స్తంభాలపై ఎలక్ట్రిక్ పరికరాలు కాలం చెల్లినా.. వాటిని మార్చకుండా అలాగే ఉంచడం గమనార్హం.



#### చెట్ల కొమ్మల తొలగింపులోనూ..

క్షేత్రస్థాయిలో ఏటా తరచూ చేపట్టాల్సిన చెట్ల కొమ్మల తొలగింపు విషయంలోనూ అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించింది. దీంతో గాలి, వానకు చాలా చోట్ల చెట్లు, వాటి కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాలో అంతరాయం తలెత్తుతున్నది. ఈ నేపథ్యంలో డిస్కం పరిధిలోని అన్ని సర్కిళ్ల పరిధిలో సమర్థవంతంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను నిర్వహించేందుకు ఇటీవల చేపట్టిన 11 కేవీ సర్వే ద్వారా లోపాలను గుర్తించి.. వాటిని సరిచేసే కార్యాచరణను సిద్ధం చేశారు.

#### రూ. 25 కోట్లతో మరమ్మతులు

డిస్కం పరిధిలోని 11 కేవీ ఫీడర్ సర్వేలో గుర్తించిన లోపాలను సరిచేసేందుకు సుమారు రూ.25.50 కోట్ల నిధులను కేటాయించారు. మరమ్మతు పనులు చేపట్టాలని క్షేత్ర స్థాయిలోని అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ నెట్‌వర్క్‌లో ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా సరఫరా ఉండేలా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. చేసే పనులు సైతం వీడియో, ఫొటోలు తీసి.. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన యాప్‌లో పొందుపర్చాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశించారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేసే కాంట్రాక్టర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఉండేందుకు ఫొటోలను జీఐఎస్ కోఆర్డినేట్స్‌తో పాటు యాప్‌లో అప్‌డేట్ చేయాలన్న నిబంధనను పెట్టి, పారదర్శకంగా పనులు పూర్తి చేయిస్తున్నారు. సెక్షన్ స్థాయిలోని అధికారులు విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షణ చేస్తూ కొత్తగా రూపొందించిన యాప్‌లో లోపాలను వెంటనే నమోదు చేసే విధానాన్ని కచ్చితంగా అమలు చేయనున్నారు. దీనిద్వారా అంతరాయాలు తగ్గి.. నిరంతరం నాణ్యమైన సరఫరాకు దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

# మెరుగైన సేవలకే.. జీఐఎస్ సర్వే

### నగరమంతా మ్యాపింగ్
### డిజిటల్ బోర్డుతో అనేక ప్రయోజనాలు
### ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావొద్దు..
### సర్వేకు సహకరించాలి
### బల్దియా కమిషనర్ ఆమ్రపాలి



సిటీబ్యూరో/హియాయత్‌నగర్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు, పట్టణ ప్రణాళిక, వనరుల నిర్వహణను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో జీఐఎస్ సర్వే ఎంతగానో దోహదపడుతుందని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించి.. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టంపై వివరించారు. జీఐఎస్‌తో గ్రేటర్ మొత్తాన్ని డ్రోన్ ద్వారా సర్వే చేసి.. రికార్డు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూములు, చిన్నా, పెద్ద రోడ్లు, చెరువులు, సరస్సులన్నీ.. ఇలా సిటీ మొత్తం మ్యాపింగ్ జరుగుతుందన్నారు.

#### ప్రతి ఇంటికి..

దాదాపు 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గల హైదరాబాద్ మహానగరంలో రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలతో కలిపి సుమారు 19 లక్షల 43 వేల నిర్మాణాలు ఉన్నట్లు కమిషనర్ వెల్లడించారు. అందులో 2.7 లక్షల కమర్షియల్ గృహాలు ఉన్నాయన్నారు. జీఐఎస్ సర్వే పూర్తయిన తర్వాత ప్రతి ఇంటికి డిజిటల్ డోర్ నంబర్ ఏర్పాటు చేస్తారని వివరించారు. ప్రతి ఇంటి ఎదుట జీఐఎస్ డిజిటల్ బోర్డు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఉదాహరణకు తమ కాలనీల్లో ఎక్కడైనా సమస్యలున్నా.. జనన, మరణ ధ్రువీకరణ పత్రం , ఆస్తుల మ్యుటేషన్, ఇతర సేవలను నేరుగా ఇంటి వద్ద నుంచే పొందవచ్చని వివరించారు. విపత్తుల సమయంలో, ప్రమాద ఘటనల్లో ప్రజలు త్వరితగతిన సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగినప్పుడు ఆయా అధికారులు వేగవంతంగా స్పందించి నేరుగా వెళ్లి సేవలు అందించే వీలు కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు వంటివి కబ్జాలకు గురికాకుండా నిఘా ఉంటుందని కమిషనర్ తెలిపారు.ఇప్పటికే హైదర్‌నగర్, మియాపూర్, చందానగర్, కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్, హయత్‌నగర్‌లలో జీఐఎస్ సర్వేను ప్రారంభించామన్నారు. శాటిలైట్, గ్రౌండ్ ఫిజికల్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 130 చదరపు కిలోమీటర్లలో డ్రోన్ సర్వే పూర్తయిందని, త్వరలో 1,40,020 ప్లాట్స్ డిజిటలైజ్ చేయనున్నట్లు చెప్పారు.

#### మొత్తం 600 బృందాలు

ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని, సర్వేకు సహకరించాలని కమిషనర్ కోరారు. ఈ సర్వేతో అన్ని కాలనీల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. మొత్తం 600 బృందాలను ఏర్పాటు చేసి, రానున్న 6 నెలల వ్యవధిలోనే సర్వే పూర్తి చేస్తామన్నారు. శాటిలైట్, డ్రోన్ ఫిజికల్ ద్వారా సర్వే నిర్వహిస్తామన్నారు. ఫిజికల్ సర్వేలో వ్యక్తిగత వివరాలను అడగడం లేదని స్పష్టం చేశారు. ఈ సర్వేతో జీహెచ్‌ఎంసీ పరిధిలో రోడ్లు, భవనాలు, చెరువులు, పార్కులు ఎన్ని ఉన్నాయి.. ఇలా ప్రతి సంఖ్య కచ్చితంగా చెప్పే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు.

## ఉస్మానియాకు ఐఎస్‌వో గుర్తింపు

సుల్తాన్ బజార్, ఆగస్టు 8: ఉస్మానియా మెడికల్ కళాశాలకు ఐఎస్‌వో 9001-2015 గుర్తింపు దక్కింది. ఈ మేరకు కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఐఎస్‌వో గుర్తింపు సంస్థ ప్రతినిధి శివయ్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్‌కు గురువారం గుర్తింపు పత్రాన్ని అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, తెలంగాణలో రెండోసారి ఉస్మానియా మెడికల్ కళాశాల ఐఎస్‌వో గుర్తింపును పొందడం అభినందనీయమన్నారు. కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్యా ప్రమాణాలు, భద్రతా సామర్థ్యంతో పాటు గ్రీన్ ఎన్విరాన్‌మెంట్‌లో మంచి బోధనను అందిస్తున్నామన్నారు. కళాశాలలోని అన్ని స్థాయి ఉద్యోగుల కృషి వల్లే కళాశాలకు రెండోసారి ఐఎస్‌వో గుర్తింపు లభించిందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శంకర్, డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.





## నాలాలోకి దిగి..

దీన్‌దయాల్ నగర్‌లోని నాలాను గురువారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బల్దియా అధికారులతో కలిసి పరిశీలించారు. స్వయంగా లోతైన నాలాలోకి దిగి పనులను పర్యవేక్షించారు. గతంలో నాలా పూడిక తీయకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయి వరదనీరు రోడ్ల పైకి వచ్చిందన్నారు. నాలా పూడిక తీస్తేనే వరదనీటి ప్రవాహం కాలనీలోకి చేరకుండా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. - నేరేడ్‌మెట్, ఆగస్టు 8